5న రాష్ట్ర వ్యాప్తంగా పల్స్‌పోలియో

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పోలియో ముక్త కర్ణాటక లక్ష్యాన్ని అందుకుంటున్నామని ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి టీకే అనిల్‌కుమార్ వెల్లడించారు. నగరంలో సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 5న ఐదేళ్లలోపు చిన్నారులందరీకి పల్స్‌పోలియో టీకాలు వేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. బీబీఎంపీ పరిధిలో ఈ అంశంపై ప్రచారం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించబోతున్నామని చెప్పారు. గ్రామ పంచాయతీలు, పట్టణాలు, నగరాలలోని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు అన్ని ప్రధాన కేంద్రాలలోనూ టీకాలు అందుబాటులో ఉంటాయన్నారు.





రాజ్యసభ ఎన్నికలపై ఉత్కంఠ

- స్వతంత్రుల మద్దతు కోసం కుపేంద్రరెడ్డి కసరత్తు
- బీజేపీ ఎమ్మెల్యేలకు విప్ జారీ
- రిసార్టుకు తరలిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- నేటి ఎన్నికలకు విధాన సౌధ వద్ద భారీ బందోబస్తు

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఉత్కంఠ పెరుగుతోంది. నలుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియడంతో మంగళవారం ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం శాసనసభలో మెజారిటీ ప్రకారం కాంగ్రెస్ మూడు స్థానాలను బీజేపీ ఒక స్థానాన్ని సునాయాసంగా విజయం సాధించేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ - జేడీఎస్ జతకట్టడంతో అనూహ్యంగా ఐదో అభ్యర్థిగా ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ రాజ్యసభ సభ్యుడు కుపేంద్రరెడ్డి పోటీకి దిగారు. ఇదే మూడు రాజకీయ పార్టీల్లోనూ తీవ్ర ఉత్కంఠకు కారణమవుతోంది. కాంగ్రెస్‌కు 135 మంది, బీజేపీకి 66 మంది, జేడీఎస్‌కు 19 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండగా ముగ్గురు స్వతంత్రులతోపాటు కేఆర్‌పీపీ ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి ఉన్నారు. ఒక రాజ్యసభ సభ్యుడు గెలవాలంటే కనీసం 45 మంది ఎమ్మెల్యేల మద్దతు కావాల్సి ఉంటుంది. శాసనసభలో కాంగ్రెస్‌కు 135 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండగా తాజాగా సురపుర ఎమ్మెల్యే రాజావెంకటప్ప నాయక అకాల మృతితో వారి బలం 134కు చేరింది. కాంగ్రెస్ తరపున పోటీలో ఉండే కేంద్రమాజీ మంత్రి అజయ్‌మెకెన్‌తో పాటు సిట్టింగ్‌లు జీసీ చంద్రశేఖర్, సయ్యద్ నాసిర్‌హుసేన్ విజయం సాధించాలంటే కనీసంగా 135 మంది సభ్యుల మద్దతు కావాలి. స్వతంత్రులు లతా మల్లికార్జున, దర్శన్‌పుట్టణ్ణయ్య, పుట్టస్వామిగౌడ కాంగ్రెస్ వైపు ఉండడంతో వారి గెలుపునకు ఢోకా లేదు. గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి ఎవరికి మద్దతు ఇచ్చే విషయం బహిరంగంగా ప్రకటించలేదు. కానీ ఐదో అభ్యర్థి కుపేంద్రరెడ్డి విజయం ధీమా వ్యక్తం చేస్తుండటంతో అధికార కాంగ్రెస్‌లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అందరి దృష్టి ఆ ఇద్దరిపైనే..

బీజేపీలో ఎమ్మెల్యేలుగా కొనసాగుతూనే అధికార కాంగ్రెస్ వైపు మద్దతు ఇచ్చేలా వ్యవహరిస్తున్న ఎస్‌టీ సోమశేఖర్, శివరాం హెబ్బార్ ఎవరికి మద్దతు ఇస్తారనే విషయమై కీలకమైంది. ఇద్దరితోనూ సీఎం, డీసీఎం చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వారిద్దరూ బీజేపీకి దాదాపు దూరంగా గడుపుతున్నారు. అధికారిక కార్యక్రమాల్లో చివరకు ప్రభుత్వ పథకాల సభలలోనూ భాగస్వాములవుతున్నారు.

విజయంపై కుపేంద్రరెడ్డి ధీమా



బీజేపీ-జేడీఎస్ మైత్రి అభ్యర్థి కుపేంద్రరెడ్డి విజయంపై విశ్వాసంతో ఉన్నారు. వాస్తవానికి ఆయనకు ఐదుగురి మద్దతు అవసరం కానుంది. గాలి జనార్దనరెడ్డి మద్దతు ఇచ్చినా మరో నలుగురు కాంగ్రెస్ నుంచి ఓటు వేసే అవకాశాలు దాదాపు లేవనిపిస్తోంది. కానీ ఆయన ధీమా వ్యక్తం చేస్తుండడంతో బీజేపీ, కాంగ్రెస్ ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. బీజేపీకి చెందిన సోమశేఖర్, శివరాం హెబ్బార్ మద్దతు పొందేందుకు కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ ప్రయత్నిస్తున్నారు. తనకు వందశాతం విజయానికి అవసరమైన ఓట్లు వస్తాయని కుపేంద్రరెడ్డి ధీమాలో ఉన్నారు. జేడీఎస్ ఎమ్మెల్యేలు పార్టీ కార్యాలయం జేపీ భవన్ నుంచి కుమారస్వామితోపాటు వచ్చి ఓటు వినియోగించుకోనున్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు పార్టీ కార్యాలయం నుంచి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరమంగలలోని హోటల్ నుంచి బస్సులో రాదలచుకున్నారు.

రిసార్టుకు తరలిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

శాసనసభ కార్యకలాపాలలో పాల్గొన్న కాంగ్రెస్ సభ్యులందరూ సురపుర ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక మృతి పట్ల సంతాపం తెలిపారు. కార్యకలాపాలు వాయిదా పడగానే కోరమంగలలోని ఎంబస్సీ గోల్ఫ్‌లింక్స్ బిజినెస్ పార్క్‌లోని హిల్సన్ హోటల్‌కు బయల్దేరారు. ఎమ్మెల్యే అంత్యక్రియలకు వెళ్లిన సీఎం సిద్దరామయ్య, కొందరు మంత్రులు మినహా మిగిలిన ఎమ్మెల్యేలంతా హోటల్‌కు వెళ్లారు. కాంగ్రెస్‌కు చెందినవారంతా సూచించినవారికే ఓట్లు వేయాలని సీఎం, డీసీఎం దిశా నిర్దేశం చేశారు. సాయంత్రం ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

బీజేపీ ఎమ్మెల్యేలకు విప్ జారీ

రాజ్యసభ ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొనేందుకు విప్ జారీ అమలు కాదు. అయినా ముందస్తుగా నిర్వహించే సమావేశానికి హాజరయ్యేలా 66మంది ఎమ్మెల్యేలకు విప్ జారీ చేశారు. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడతారనే అనుమానాలు వెంటాడుతున్నాయి. బీజేపీకి 66 మంది మద్దతు ఉండడంతో అభ్యర్థి నారాయణసభాండగె సునాయాసంగా గెలవనున్నారు. మిగిలిన 21 ఓట్లు మైత్రి అభ్యర్థిగా బరిలోకి దిగిన కుపేంద్రరెడ్డికి మద్దతు ఇస్తారు. జేడీఎస్‌కు చెందిన 19మంది ఎమ్మెల్యేల మద్దతు సహజంగానే ఉంటుంది. ఇలా 40 మంది మద్దతు సాధ్యమవుతుంది. మరో ఐదుగురి మద్దతు కోసం కసరత్తు సాగిస్తున్నారు.

విధానసౌధ ప్రాంగణంలో భారీ బందోబస్తు



రాజ్యసభ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో విధానసౌధలోని ప్రాంగణమంతా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలదాకా పోలింగ్ జరగనుంది. మొదటి అంతస్థులోని 106వ గదిలో పోలింగ్ జరగనుంది. సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. ఎమ్మెల్యేలకు ఓటు వేసే విధానంపై ఇప్పటికే అవగాహన కల్పించగా మరోసారి పార్టీల ముఖ్యులు అందుకు తగిన నైపుణ్యం కల్పిస్తున్నారు.

సీఎంను కలిసిన గాలి జనార్దనరెడ్డి



సీఎం, డీసీఎంతో గాలి జనార్దనరెడ్డి, మంత్రి శివరాజ్ తంగడగి

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మరికొన్ని గంటల్లోనే శాసనసభ్యుల కోటా నుంచి రాజ్యసభ సభ్యుడిని ఎన్నుకునే కీలక ఎన్నికలు జరుగుతున్న తరుణంలో కల్యాణ రాజ్య ప్రగతి పక్ష ఎమ్మెల్యే గాలిజనార్దనరెడ్డి ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలవడం ప్రత్యేకతను సంతరించుకుంది. సోమవారం ఆయన సీఎంను అధికారిక నివాసం కావేరిలో కలిశారు. డీసీఎం డీకే శివకుమార్, కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడిగ కూడా ఉన్నారు. రాష్ట్రంలో నాలుగు రాజ్యసభ స్థానాలకు మంగళవారం ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటి దాకా గాలి జనార్దనరెడ్డి బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇస్తారనే ప్రచారం సాగింది. ఆయన కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీని తరచూ కొనియాడుతున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ మూడు, బీజేపీ ఒక స్థానంలో విజయానికి ఢోకా లేదు. కానీ బీజేపీ- జేడీఎస్ మైత్రి అభ్యర్థిగా కుపేంద్రరెడ్డి రంగంలో ఉండడంతోనే సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఇదే తరుణంలోనే గాలి జనార్దనరెడ్డి ముఖ్యమంత్రిని కలవడం ప్రత్యేకతగా మారింది. అనంతరం జనార్దనరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కొప్పళ జిల్లా గంగావతి పరిధిలోని ఆనెగొంది ఉత్సవాల్లో పాల్గొనాలని సీఎంను ఆహ్వానించేందుకు వెళ్లానని పేర్కొన్నారు. ఇదే సందర్భంలోనే డీసీఎం డీకే శివకుమార్, మంత్రి శివరాజ్ తంగడిగ ఉన్నారని తెలిపారు. రాజ్యసభ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని సీఎం కోరారని వివరించారు. తాను ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశానని అన్నారు.

ఎద్దుల బండిని ఢీకొన్న ద్విచక్రవాహనం

ముగ్గురి మృతి

కంప్లి, ఫిబ్రవరి 26 : కుడితిని పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త దరోజీ సమీపాన సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనం ఎద్దుల బండిని ఢీకొని వెంకటేష్ (45), అఖిల (8), ఆశ (6) మృతి చెందగా సరస్వతి, జంబక్క తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు కుడితిని ఎస్ఐ ఉలిగేష్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతులు, క్షతగాత్రులను బళ్లారి విమ్స్‌కు తరలించారు. ఘటనపై కుడితిని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వెంకటేష్, అఖిల్, ఆశ, సరస్వతి, జంబక్క బళ్లారి నుంచి హోస్పేటకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మార్గమధ్యంలో దరోజీ వద్ద వాహనం అదుపుతప్పి ముందు వెళుతున్న ఎద్దులబండిని ఢీకొని కొందపడ్డారు. వెంకటేష్, అఖిల, ఆశ తలలకు తీవ్ర గాయాలు కావడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ భండారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకటేష్ మేస్త్రీ పని చేస్తుండగా అతడి వద్ద సరస్వతి, జంబక్క కూలీలుగా పనిచేస్తున్నారు. ఆలూరు నుంచి బళ్లారికి రావడంతో బళ్లారి నుంచి వెంకటేష్ సరస్వతి, జంబక్కతో పాటు వారి పిల్లలు అఖిల, ఆశలను ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని తీసుకెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రంజిత్ కుమార్ భండారి, పోలీసులు
మృతి చెందిన వెంకటేష్, అఖిల, ఆశ

నిరుద్యోగులకు అండగా ఉంటాం

- యువనిధి అమలుతో హామీ నిలబెట్టుకున్నాం
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య



ఉద్యోగమేళాను ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగులకు తమ ప్రభుత్వం కొండంత అండగా ఉంటుందని, యువనిధి గ్యారెంటీని అమలు చేయడం ద్వారా హామీ నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. కర్ణాటక నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనాశాఖ ఆధ్వర్యంలో ప్యాలెస్ మైదానంలో సోమవారం ఏర్పాటు చేసిన యువ సమృద్ధి భారీ ఉద్యోగమేళాను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ నిరుద్యోగులకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించిన కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం గత పదేళ్లుగా దగా చేస్తూ వచ్చిందన్నారు. కోట్లాది ఉద్యోగాల సంగతి దేవుడెరుగు... ఉన్న ఉద్యోగాలను ఊడపీకేస్తున్నారని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చి వారు ఎక్కడికి వెళ్లినా రాణించేలా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య, నైపుణ్యాభివృద్ధిశాఖల మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్ మాట్లాడుతూ 600కు పైగా కంపెనీలు రెండు రోజులపాటు జరిగే ఉద్యోగమేళాలోపాల్గొని కనీసం 50వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని తెలిపారు. తమకు తెలిసి రాష్ట్రంలోనే ఇది అతిపెద్ద ఉద్యోగమేళా కానుందన్నారు. మేళాలో రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది నిరుద్యోగులు పాల్గొన్నారు. అక్కడికక్కడే వారికి ఇంటర్వ్యూలు చేసి అర్హతా పత్రాలను పరిశీలించి పలు కంపెనీలు ఉద్యోగ నియామక లేఖలు అందజేశాయి. కార్యక్రమంలో కర్ణాటక నైపుణ్యాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు డాక్టర్ ఈవీ రమణారెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మేళా మంగళవారం సాయంత్రం వరకు కొనసాగనుంది.



మీడియా సమావేశంలో సమాచార శాఖ కార్యదర్శి డాక్టర్ కేవీ త్రిలోక్‌చంద్ర తదితరులు

29 నుంచి అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలు

- 50 దేశాల చిత్రాల ప్రదర్శన

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు నగరం సిద్ధమైంది. ఈనెల 29న చిత్రోత్సవాలను ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభిస్తారని సమాచార శాఖ కార్యదర్శి డాక్టర్ కేవీ త్రిలోక్‌చంద్ర ప్రకటించారు. సోమవారం సమాచారశాఖ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చిత్రోత్సవాల ప్రారంభంలో సీఎంతో పాటు డీసీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్, స్పీకర్ యూటీ ఖాదర్, పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి సహా ముఖ్యులు పాల్గొంటారని చెప్పారు. చెక్ రిపబ్లిక్ విద్యానిపుణులు, సినీ విమర్శకులు వియేరా లాంగరూవా, బంగ్లాదేశ్‌కు చెందిన అజమేరి హెచ్ బాధోన్‌తో పాటు కన్నడ సినీ ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. మార్చి 7వరకూ ఉత్సవాలు సాగుతాయని, 50 దేశాలకు చెందిన 180 సినిమాలను ప్రదర్శిస్తామని వివరించారు. ఇండియన్, ఏషియన్ సినిమాలకు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. 30 కన్నడ సినిమాలను ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. న్యాయనిర్ణేతలుగా సినీరంగంలో అపార అనుభవం కలిగిన వారిని ఎంపిక చేశామన్నారు. షార్ట్ ఫిలింల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. సందేశాత్మకత, సాంకేతికత, మహిళా సాధికారితతో పాటు భిన్నమైన సినిమాలు ఉంటాయన్నారు. సమాచారశాఖ కమిషనర్ హేమంత్ నింబాళ్కర్ సహా పలువురు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

ప్రభుత్వ లాంఛనాలతో ఎమ్మెల్యే అంత్యక్రియలు

- హాజరైన ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఆదివారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందిన యాదగిరి జిల్లా సురపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక (67) అంత్యక్రియలు సోమవారం సాయంత్రం సురపుర వాల్మీకి శ్మశానవాటికలో సకల ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. ముఖ్యమంత్రి సిద్దరామయ్య హాజరై ఆయనకు కడపటి నివాళి అర్పించారు. పోలీసు బ్యాండ్ బృందం జాతీయ గీతం ఆలపించగా గాలిలోకి మూడు రౌండ్ల తుపాకులు పేల్చి రెండు నిముషాలు మౌనం పాటించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శరణబసప్ప దర్శనాపుర, ఐటీ బీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే, యువజన సేవలు క్రీడల శాఖ మంత్రి నాగేంద్ర, ప్రజాపనుల శాఖ మంత్రి సతీష్ జార్కిహోళి, రాయచూరు ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఐజీపీ అజయ్ హిలోరి, ఎస్పీ జి.సంగీతతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ప్రజలు తమ ప్రియతమ నేతకు కడసారి నివాళులర్పించి కన్నీటి పర్యంతమయ్యారు. సీఎంను చూడగానే బోరున విలపించిన కుటుంబ సభ్యులను సీఎం సముదాయించారు.


టీడీపీని గెలిపించి.. ఏపీని కాపాడుకుందాం

- కనిగిరి నియోజకవర్గ పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పిలుపు

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికలు అత్యంత కీలకమని, రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ఒక అపూర్వ అవకాశమని ఎట్టి పరిస్థితుల్లోనూ దీన్ని వదులుకోవద్దని కనిగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. బెంగళూరు కల్యాణనగర్‌లోని చెళ్లకెరె కొంకణ్ సముదాయభవన్‌లో సోమవారం జరిగిన కనిగిరి శాసనసభ నియోజకవర్గ తెలుగుదేశం అభిమానుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచేలా ప్రసంగించారు. ఒక్కచాన్స్ అంటూ ఏపీలో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. తద్వారా రాష్ట్ర అభివృద్ధి 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు. ఏపీలో ప్రజలకు రక్షణ కరువైందని, చివరకు జర్నలిస్టులను కూడా వదలడం లేదని విరుచుకుపడ్డారు. తెలుగుదేశం అభిమానులు, కార్యకర్తలు సంఘటితమై ఏపీలోని ప్రతి నియోజకవర్గంలోనూ తమదే విజయంగా భావించి తెలుగుదేశం అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దివంగత ఎన్టీఆర్ ప్రపంచవ్యాప్తంగా చాటి చెబితే తెలుగు ప్రజల సామర్థ్యాలను చంద్రబాబునాయుడు ప్రపంచవ్యాప్తంగా మారుమోగేలా చేశారన్నారు. ప్రత్యేకించి ఆయన హయాంలోనే అభివృద్ధి కొత్త పుంతలు తొక్కిందన్నారు. టీడీపీ అభిమానులు, కార్యకర్తలతో పాటు అన్యాయాన్ని ప్రశ్నించేవారిపై దాడులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇలాంటి పరిస్థితి దేశంలో మరెక్కడా లేదన్నారు. అంతకుముందు కనిగిరి నియోజకవర్గ వాసుల క్షేమ సమాచారాన్ని పేరు పేరునా అడిగి తెలుసుకున్నారు. వారి సలహా సూచనలు సావధానంగా ఆలకించారు. పామూరుపల్లికి చెందిన గంగవరపు సుబ్బారావు తొలుత స్వాగతం పలికారు. కార్యక్రమంలో కనకమేడల వీర, అట్లూరి రామకృష్ణరాజు, మద్దినేని మోహన్‌రావు, గొల్ల కిరణ్, చింతగంపల మహేంద్ర, కురుగొండ్ల దామోదర్, ఏవీఆర్, వీరస్వామి, లక్ష్మీనారాయణ, డి. సుబ్బారావు, ధనేకుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కనిగిరి నియోజకవర్గ నేతలతోపాటు బీటీఎఫ్ పదాధికారులు, కార్యవర్గ సభ్యులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



కనిగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని సన్మానిస్తున్న నేతలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.14	1,606.30
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	848	8,384
సామర్థ్యం (టీఎంసీలు)	8.80	30.84

అద్భుతం..అమృతేశ్వర ఆలయం

● పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధం ● 29న విగ్రహ ప్రతిష్ఠ ● హాజరు కానున్న దర్శకుడు రాజమౌళి, కన్నడ నటుడు యశ్, సింగర్ మంగ్లీ .. ● శివానుగ్రహంతోనే ఆలయ నిర్మాణం: వారాహి అధినేత కొర్రపాటి సాయి



బళ్లారి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అమృతేశ్వర ఆలయం అద్భుతంగా రూపుదిద్దుకొంది. బళ్లారి సమీపంలోని బాలాజీ క్యాంపు అమృతేశ్వర ఆలయం భక్తులకు దర్శన భాగ్యం కలిగించేందుకు సిద్ధమయ్యింది. చుట్టూ పచ్చటి పైర్లు.. తుంగభద్ర జలాలు ప్రవహిస్తూ మనసును ఆనందింప చేసే చల్లటి ప్రదేశం లో అత్యంత విశాలమైన ప్రదేశంలో అమృతేశ్వర ఆలయాన్ని నిర్మించారు. వారాహి సినిమా బ్యానర్ అధినేత అయిన కొర్రపాటి సాయి కుటుంబం, భక్తుల సహకారంతో ఈ అద్భుత అమృతేశ్వర ఆలయాన్ని నిర్మించారు. కృష్ణశిలా రాయితో ఆలయం అంతా ఏక శిలతో నిర్మించడం ఇక్కడి ప్రత్యేకత. గర్భగుడిలోని అమృతేశ్వర విగ్రహం స్ఫటికతో చెక్కిన కారణంగా విగ్రహం ప్రాణం పోసిన శివుడులా కనిపిస్తు న్నారు. ఆలయంలో గర్భగుడి చుట్టూ నందులు శివున్ని తిలకిస్తూ ఉండేలా విగ్రహాలు ఏర్పా టు చేయడం, ఆలయ ప్రాంగణంలో 39 అడుగుల ఎత్తుతో హనుమంతుడి విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు నవగ్రహాలు, అమ్మవారి ఆలయాలు నిర్మించారు. సుమారు ఎకరాకు పైగా నిర్మించిన ఈ ఆలయంలో ఎన్నో సుందరమైన కట్టడాలు ఆకట్టుకుంటున్నాయి. 29వరకు జరిగే విశేష పూజల్లో పరమ పూజ్య శ్రీ స్వయంప్రకాశ సచ్చిదానంద స రస్వతి స్వాములతో పాటు. ప్రముఖ డైరెక్టర్ రాజమౌళి, సింగర్ మంగ్లీ, కన్నడ సినీ నటుడు యశ్, భక్తులు పెద్ద ఎత్తున హజరవుతున్నారు.



కృష్ణ శిలతో రూపొందించిన 39 అడుగుల ఆంజనేయుడి విగ్రహం



ప్రత్యేక పూజల్లో కొర్రపాటి సాయి దంపతులు



వెంకటప్ప నాయకకు నివాళులర్పిస్తున్న కార్యకర్తలు

రాజా వెంకటప్పనాయకకు నివాళి

కంప్లి, ఫిబ్రవరి 26 : గుండెపోటుతో అకాల మరణం చెందిన యాదగిరి జిల్లా తుర్వూరు తాలుకా ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయకకు కాంగ్రెస్ కార్యకర్తలు నివాళి అర్పించారు. సోమవారం ఎమ్మెల్యే జేఎన్ గణేష్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పురసభ మాజీ అధ్యక్షుడు సుధీర్ మాట్లాడుతూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది తాలుకాను అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన నాయకుడిగా వెంకటప్ప నాయక్ పేరొందరాన్నారు. ఆయన మృతి పార్టీకి, కార్యకర్తలకు తీరని లోటన్నారు. పార్టీ ఆయన కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. నియోజక వర్గానికి ఆయన చేసిన సేవలు అమోఘమన్నారు. ఆయన ఆత్మకు శాంతికి కలగాలని వారు అభిప్రాయపడ్డారు. వారితో పాటు హబీబ్ రెహ్మాన్, శశికుమార్, మునాఫ్, మస్తాన్, జిలాన్‌సాబ్, వీరేష్, గోపాల్, ప్రసాద్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో శిశు అభివృద్ధి యోజన కార్యాలయం



శిథిలావస్థకు చేరుకున్న పాత శిశు అభివృద్ధి యోజన కార్యాలయం

సిరుగుప్ప, ఫిబ్రవరి 26 : శిథిలావస్థకు చేరుకున్న పాత శిశు అభివృద్ధి యోజన కార్యాలయాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సిరుగుప్ప తాలుకాలో 50 యేళ్ల క్రితం తాలుకా పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేయడంతో ఈ కార్యాలయాన్ని అందుకు ఉపయోగించారు. రెండేళ్ల నుంచి ఈ భవనం పూర్తిగా ధ్వంసమైంది. పైకప్పు అంతా లేచిపోయి, గోడలు బీటలువారాయి. స్థానికులు ఈ భవనాన్ని తొలగించాలని తాలుకా పంచాయతీ ఈఓకు పలుమార్లు వినతిపత్రాన్ని అందజేసినా పట్టించుకోకపోవడం గమనార్హం. ఇకనైనా అధికారులు దృష్టిసారించి ఈ భవనాన్ని తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



సిద్దప్పను సన్మానిస్తున్న యువ కార్యకర్తలు

బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా సిద్దప్ప

సిరుగుప్ప, ఫిబ్రవరి 26 : బీజేపీ నూతన యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సిద్ధప్పను సోమవారం కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ కార్యకర్తలు ఆయనకు పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన బీజేపీ, యువత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికలలో ప్రతి ఓటు కీలకమన్నారు.

వైభవంగా పంపాపతి రథోత్సవం

కంప్లి, ఫిబ్రవరి 26 : పంపావతి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. కంప్లి కోటలో వెలసిన పంపాపతి రథోత్సవం సోమవారం జరిగింది. ఉదయం పంపాపతి స్వామికి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని లాగారు. కంప్లి కోటతో పాటు గంగావతి, కురుగోడు, హోస్పేట, తదితర పట్టణాలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మెక్కులు తీర్చుకున్నారు.



కంప్లి కోట వద్ద రథాన్ని లాగుతున్న భక్తులు

ఘనంగా సంత్‌సేవాలాల్ జయంతి

గంగావతి రూరల్, ఫిబ్రవరి 26: నగరంలో సోమవారం సేవాలాల్ జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు మాజీఎమ్మెల్సీ శ్రీనాథ్, మల్లికార్జున నివాళులర్పించారు. ఊరేగింపులో మఠం నుంచి విరూపాపుర తాండ వరకు వాయిద్యాలతో ఊరేగించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ శ్రీనాథ్ సంత్‌సేవాలాల్ సేవలను ప్రజలకు తెలియజేశారు. భీమన్న నాయక్, లక్ష్మణ, పరశురాం, ప్రేమచంద్, హనుమంత పాల్గొన్నారు.



ఊరేగింపులో ప్రముఖ బంజరా పదాధికారులు

అభివృద్ధికి నోచుకోని స్మారకాలు



శిథిలమవుతున్న ప్రాచీన స్మారకాలు

కంప్లి, ఫిబ్రవరి 26 : హంపి పుణ్యక్షేత్రంలో ప్రసిద్ధిగాంచిన ఆలయాలు, గోపురాలు, స్మారకాలు అభివృద్ధికి నోచుకోక ఇప్పటికీ శిథిలావస్థలోనే వుండిపోయాయి. హంపి పుణ్యక్షేత్రానికి దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. కానీ మండపాలు, గోపురాలు, స్మారకాలు, అభివృదిపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. హేమకూట స్మారకాలు, హంపి విరుపాక్షేశ్వర ఆలయ గోపురాలు, గజశాల మండపాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రాచీన చరిత్రను చాటే స్మారకాలను కాపాడాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హంపి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వే అభివృద్ధి పనుల్లో మరింత వేగం : ఎంపీ

రాయచూరు, ఫిబ్రవరి 26 : అమృత్ భారత్ స్టేషన్‌ల అభివృద్ధి పథకంలో భాగంగా 22 కోట్లతో చేపట్టే పనుల వల్ల జిల్లాలో రైల్వే అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయని రాయచూరు ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ అన్నారు. అమృత్ భారత్ స్టేషన్‌ల పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా ఉన్న 554 స్టేసన్‌లు 1500 ఆర్‌యూబీ,ఆర్‌ఓబీల నిర్మాణ పనులకు సోమవారం ప్రధాన నరేంద్ర మోదీ వర్చువల్‌గా వంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో ద్వార నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ రాయచూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్, ఇప్పటికే జిల్లాలో పలు రోడ్డు రహదారుల పనులు వేగవంతంగా సాగుతున్న నేపద్యంలో రైల్వే అభివృద్ధితో జిల్లా అభివృద్ధి రూపురేఖలు మారనున్నాయన్నారు. రైల్వే స్టేషన్‌లో సరికొత్త హంగులతో సౌకర్యాలు కల్పించడంతో పాటు మటమారి వద్ద ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులు పూర్తికానున్నాయన్నారు. దీంతో పాటే నగర సమీపంలోని మన్సలాపూర్ లెవల్ క్రాసింగ్ త్వరలోనే రైల్వే అండర్ బ్రిడ్జిగా మారనుందన్నారు. కాగా జిల్లాలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఎంపీ ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు.



రైల్వే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్

అగ్ని ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం

రాయచూరు, ఫిబ్రవరి 26 : జిల్లాలోని మస్కి పట్టణంలో సోమవారం జరిగిన ఒక అగ్ని ప్రమాదంలో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. మస్కి పట్టణంలోని భవాని నగర్‌లో నివశిస్తున్న గౌసపీర్ కుటుంబం వ్యాపారం నిమిత్తం హట్టి పట్టణానికి వెల్లగా వారు నిశశిస్తున్న రేకుల శెడ్లలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ఇంట్లో గృహ వినియోగ వస్తువులతో పాటు ఆహార ధాన్యాలు ఇతరత్ర దాదాపు రూ.20లక్షలకు పైగా విలువ చేసే వస్తువులన్ని పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదం వార్త తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నిరుగా విలపిస్తు సంఘటన స్థళానికి చేరుకున్నారు. సంఘటనకు సంబంధించి మస్కి పోలీసులు కేసు నమోదు చేశారు.





విలపిస్తున్న బాధితులు

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

స్మారకాల సందర్శన



అమరవీరుల చరిత్ర వివరిస్తున్న ఉపాధ్యాయుడు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 26: తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాల చిన్నారులు, ప్రధానోపాధ్యాయుడు రవిచెళ్ళగుర్కితో కలిసి భారత స్వాతంత్ర్య పోరాట అమరవీరుల స్మారకాలను సోమవారం సందర్శించారు. నగర నడిబొడ్డున ఉన్న అమరవీరులు బిందుమాధవ్ స్మారక చిహ్నం, మల్లసజ్జన వ్యాయామ శాల, టేకూరు సుబ్రమణ్యం, మహాబలేశ్వరప్ప స్మారకాలను సందర్శించారు. అనంతరం వ్యాయామ పాఠశాలలో ఉన్న సీనియర్లను కలుసుకుని స్థానిక స్వాతంత్ర్య సమరయోదుల పోరాటాన్ని తెలుసుకున్నారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవిచెళ్లగుర్కి మాట్లాడుతూ 1946లో అమరవీరుల స్మారక చిహ్నాన్ని నెలకొల్పారు. నేటికీ ఇక్కడ వ్యాయామం, వ్యాయామశాలలో శిక్షణ తీసుకునే వారి సంఖ్య తగ్గలేదు. శిల్పంలో చెక్కిన వందేమాతరం, గాంధీజీ పదకొండు ప్రతిజ్ఞలను చదివారు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక స్థానిక స్వాతంత్ర్య సమరయోధులపై పీహెచ్‌డీ కూడా చేయవచ్చని సూచించారు. అమరవీరుల చరిత్రపై అవగాహన కలిగి ఉంటే ఎంతో ఉపయోగకరమని, విద్యార్థులు వారి జీవితాలను ఆదర్శంగా తీసుకుని, విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు.

అధికారి సస్పెన్షన్‌కు లోకాయుక్త సిఫార్సు



ప్లానింగ్ అధికారి శరణప్ప పట్టేద్(ఫైల్)

రాయచూరు, ఫిబ్రవరి 26 : ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల మేరకు క్యాశోటెక్ సంస్థలో గత కొన్నేళ్లగా పని చేస్తున్న ప్లానింగ్ అధికారి శరణప్ప పట్టేద్‌ని సస్పెండ్ చేయాల్సిందిగా లోకాయుక్త అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. గత ఏడాది అక్టోబర్ నెలలో లోకాయుక్త అధికారులు శరణప్ప పట్టేద్ నివాసం, కార్యాలయాల పై ఏకకాలంలో జరిపిన దాడుల్లో ఆయన ఆదాయానికి మించి 150 శాతం మేరకు ఎక్కువగా ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. అప్పట్లోనే ఈ విషయం సంచలనంగా మారగా ఇప్పటి వరకు ఆయన అదే పదవిలో కొనసాగుతుండడం గమనార్హం. సహజంగా లోకాయుక్త దాడిలో పట్టుబడిన అధికారులను సస్పెండ్ చేయడం ఆనవాయితీ కాగా అందుకు విరుద్ధంగా శరణప్ప పట్టేద్ ఇప్పటికి అదే పదవిలో కొనసాగుతుండడాన్ని లోకాయుక్త అధికారులు తీవ్రంగా పరిగణించారు. ఆయన అదే పదవిలో కొనసాగితే విచారణ సజావుగా సాగదని గుర్తించిన లోకాయుక్త అధికారులు అతడిని సస్పెండ్ చేయాల్సిందిగా ప్రభుత్వానికి లేఖ రాశారు. కాగా స్వయంగా జిల్లాధికారి అధ్యక్షతన పని చేసే క్యాశోటెక్ సంస్థలో ప్లానింగ్ అధికారిగా ఉన్న శరణప్ప పట్టేద్‌పై అవినీతి ఆరోపణలు గతంలోనే పెద్ద ఎత్తున వెల్లువెత్తగా ఇప్పటికి ఆయన అదే పదవిలో కొనసాగుతుండడాన్ని ఇతర శాఖల అధికారులు ప్రశ్నిస్తున్నారు. అదే సమయంలో కొత్త ప్లానింగ్ అధికారి వస్తాడో? రాడో? అన్నదాని పై సందిగ్ధం నెలకొంది.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

● జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే



పోసర్లు విడుదల చేస్తున్న జడ్పీ సీఈఓ ఇతర అధికారులు

రాయచూరు, ఫిబ్రవరి 26 : మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భగా మాట్లాడిన సీఈఓ ఐదేళ్ల లోపు బాలలందరికి విధిగా పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేసేలా స్థానికంగా ఉండే ఇతర శాఖల అధికారులతో వైద్య ఆరోగ్య శాఖ వారు సమన్వయం చేసుకోవాలని సూచించారు.

చెత్తకు నిప్పంటుకుని కలకలం


రాయచూరు, ఫిబ్రవరి 26 : జిల్లాలోని సిరవార పట్టణంలో చెత్తకు నిప్పంటుకోవడంతో పెద్ద ఎత్తున కలకలంరేగింది. వ్యవసాయ సబ్ మార్కెట్ కమిటీ ఇటీవల నిరుపయోగంగా ఉండడంతో ఎలాంటి వ్యాపార లావాదేవిలు లేకుండా నిరుపయోగంగా ఉండడంతో మార్కెట్ ఆవరణలో పెద్ద ఎత్తున కంప చెట్లు మోడిచాయి. దీనికితోడు ఇరుగు-పొరుగు వారు చెత్తచెదారాన్ని తెచ్చి ఈ ఖాళీ స్థళంలో వేస్తుండడంతో చెత్త రాశులుగా పోగైంది. ఈ చెత్తకు నిప్పంటుకోవడంతో సోమవారం ఒక్కసారిగా మార్కెట్ యార్డ్ ఆవరణలో మంటలు చెలరేగాయి. యార్డ్‌కు ఆనుకుని పెట్రోల్ పంప్ ఉండడంతో స్థానికుల్లో ఒక్కసారి భయాందోళనలు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న లింగసుగూరు అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకుని మంటల్పారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిపోయినట్లు స్థానికులు ఊపిరి పీ ల్చుకున్నారు.



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హోసూరు జోన్

బీటెక్ విద్యార్థి అనుమానాస్పద మృతి



హర్షిత్‌కోట్నాల (ఫైల్)

హోసూరు, ఫిబ్రవరి 26: సరిహద్దులోని కర్ణాటకకు చెందిన ఆనేకల్‌లో అదృశ్యమైన బీటెక్ విద్యార్థి కాలిపోయిన మృతదేహం నీలగిరి తోటలో లభించింది. విద్యార్థి సజీవదనమైనట్లు భావిస్తున్నారు. ఉత్తర్‌ఖండ్‌కు చెందిన హర్షిత్ కోట్నాల(21) ఆనేకల్‌లోని ఓ ప్రైవేట్ యూనివర్శిటీలో బీటెక్ చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈనెల 21న ఉదయం విద్యార్థి హాస్టల్ నుంచి బస్సులో వెళ్లలేదు. కనీసం ఆ సాయంత్రం కళాశాలకు కూడా వెళ్లలేదు, హాస్టల్‌కు రాలేదు. అనుమానంతో హాస్టల్ సిబ్బంది సీసీటీవీ పుట్టేజీని పరిశీలించగా హర్షిత్ హాస్టల్ నుంచి బయటకు వెళ్లినట్టు గుర్తించారు. ఆ తర్వాత అతను వాపసు రాలేదు. అతడి మొబైల్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ అయింది. దీంతో ఆందోళనకు గురైన యూనివర్శిటీ యజమాన్యం ఆనేకల్ పోలీస్ స్టేషన్ సహా తమిళనాడు సరిహద్దులోని తళి పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. హర్షిత్ తల్లిదండ్రులకు కూడా సమాచారం అందించారు. అతడికోసం పోలీసులు గాలింపులు చేపట్టారు. ఆనేకల్ సమీపంలోని తిగళరహళ్లి గ్రామ నీలగిరి తోపులో విద్యార్థి శవమై కనిపించినట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా మృతదేహం దగ్గర ఓ బ్యాగ్ పడి ఉంది. బ్యాగులో కళాశాల గుర్తింపు కార్డు ఉంది. దీంతో మృతి చెందిన వ్యక్తి హర్షిత్‌గా గుర్తించారు. అతడిని పెట్రోల్ పోసి నిప్పంటించారని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించిన పలు కోణాలలో దర్యాప్తు చేపట్టారు. విద్యార్థి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. విద్యార్థి మృతిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా జయలలిత జయంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అన్నా డీఎంకే నాయకులు

హోసూరు(సిప్‌కాట్), ఫిబ్రవరి 26: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతిని పురస్కరించుకుని బాగలూరులో బహిరంగ సభ నిర్వహించారు. జిల్లా కౌన్సిల్ రవికుమార్ అధ్యక్షత వహించగా అన్నాడీఎంకే వి. దాన ప్రచార కార్యదర్శి రాజ్యసభ సభ్యుడు తంబిదురై, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, ఛీఫ్ క్లబ్ స్పీకర్ శరత్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని ప్రసంగించారు. అన్నాడీఎంకే పాలనలో ఏళ్ల తరబడి పన్నులు లేని బడ్జెట్ అమలు చేశారన్నారు. అలాగే ప్రజలకు అవసరమైన ల్యాప్ టాప్ పథకం, పశువుల సరఫరా పథకం, హరిత గృహాల పథకం తదితర కార్యక్రమాలు ఇటీవల ఆగిపోయాయన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజేంద్రన్, హోసూరు యూనియన్ కమిటీ అధ్యక్షుడు శశివెంకట్ స్వామి, ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, బాగలూరు పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడు జయరామన్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, సాహిత్య బృందం జిల్లా కార్యదర్శి యూనియన్ అన్నా ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, చెన్న కృష్ణన్, అమ్మ కౌన్సిల్ జిల్లా కార్యదర్శి జగదీశ్, హోసూరు యూనియన్ కమిటీ సభ్యులు మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో యువకుడి హత్య

హోసూరు(క్రైం), ఫిబ్రవరి 26: సరిహద్దులో కర్ణాటక రాష్ట్రం ఆనేకల్ సమీపాన మరసూరు గ్రామంలో ఓ యువకుడిని నడిరోడ్డుపై నరికి చంపిన ఘటన కలకలం రేపింది. సూర్యనగర్‌కు మరసూరు గ్రామానికి చె ందిన విజయకుమార్ (27)గతంలో మనోజ్ బబ్లూ హత్యకేసులో 2017 అరెస్టు అయ్యాడు. ఈ కేసులో ఏడు నెలల క్రితం బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇంట్లో నిద్రిస్తున్న విజయ కుమార్‌కు ఫోన్ వచ్చింది. ఫోన్ మాట్లాడుతూ బయటకు రాగా దుండగులు ఇంటి ముందు రోడ్డుపై ఆయుధాలతో దాడి చేసి హతమార్చి పారిపోయారు. ఆనేకల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎన్నికల వ్యయాన్ని పర్యవేక్షించాలి

● అధికారులకు డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 26: రానున్న లోక్‌సభ ఎన్నికలను స్వేచ్ఛగా , నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అభ్యర్థుల ఖర్చు పై నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి , జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కేస్వాన్ హాల్లో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కు సంబంధించి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్ ఓ ఏ, ఈఆర్వో అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులను నిష్పక్షంగాపాతంగా నిర్వహించాలని, అభ్యర్థుల ఖర్చులను నిశితంగా పరిశీలించాలన్నారు. ఈ ఎన్నికల కోసం అభ్యర్థులు ఖర్చు చేసే డబ్బు పరిమితని గరిష్టంగా రూ.96లక్షల రుపాయలుగా నిర్ణయించామన్నారు. నిర్ణీత వ్యయంపై నిశితంగా గమనిస్తూ ఎప్పటికప్పుడు నివేధిక పంపాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఎన్నికల సమయంలో అక్రమ వినియోగం, అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలన్నారు. మోడల్‌ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తే ఎంసీసీ బృం దాలు దానిని ఉల్లంఘించకుండా జాగ్రత్తపడాలి. సహాయక వ్యయ ప రిశీలకులు , ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో సర్వేలెన్స్ బృందాలు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు ఇప్పటికైనా అప్రమత్తంగా, నిజాయితీగా నిష్పక్షపాతంగా పనిచేయాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఏ పార్టీ నేతలైనా బహిరంగ సమావేశాలు ఏర్పాటు చేయరాదన్నారు. సూపరింటెండెంట్ ఆఫ్ అకౌంట్స్ డాక్టర్ శశిశేఖర రెడ్డి మాట్లాడుతూ ఆబ్జెక్టివ్ వ్య యాన్ని పేర్కొనాలన్నారు. రాజ కీయాలకు , అభ్యర్థుల ప్రచారానికి ప్రచారానికి డబ్బు వినియోగించి ఎన్నికల మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు నిర్ధారించి కేసు న మోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

బీఎస్ యడియూరప్ప (పుట్టినరోజు)



దక్షిణాదిన భారతీయ జనతా పార్టీ అగ్రనేతలలో ఒకరైన బీఎస్ యడియూరప్ప 1943 ఫిబ్రవరి 27న మండ్య జిల్లా బూకనకెరె గ్రామంలో జన్మించారు. 1970లో శికారిపుర ఆర్ఎస్ఎస్ కార్యదర్శిగా, తర్వాత తాలూకా జనసంఘ్ అధ్యక్షుడిగా, 1975లో శికారిపుర పురపాలక సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించారు. అనంతరం ఎమర్జెన్సీలో జైలుపాలయ్యారు. 1980లో బీజేపీ ఆవిర్భావంతో తాలూకా బీజేపీ అధ్యక్షుడిగా, తర్వాత శివమొగ్గ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. అనతి కాలంలోనే కర్ణాటక బీజేపీ అధ్యక్ష స్థాయికి ఎదిగారు. నాలుగురుసార్లు ముఖ్యమంత్రిగా, మూడుసార్లు శాసనసభ ప్రతిపక్షనేతగా వ్యవహరించారు. 8సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడిగా కొనసాగుతున్నారు.

కాన్‌స్టాంటైన్ ది గ్రేట్ (జయంతి)




రోమన్ చక్రవర్తి కాన్‌స్టాంటైన్ 272 ఫిబ్రవరి 27న సెర్బియా దేశంలో జన్మించారు. రోమన్ సామ్రాజ్యాన్ని 306 నుంచి 337 వరకు పాలించినట్లు చరిత్ర కథనం. తండ్రి మరణానంతరం అనూహ్యంగా పాలనా పగ్గాలు చేపట్టారు. పాలన, ఆర్థిక, సామాజిక అంశాలతోపాటు మిలిటరీ విధానంలోనూ పలు సంస్కరణలు చేసి మంచి పేరొందారు. ఆయన ప్రవేశపెట్టిన బంగారు నాణెం వెయ్యి సంవత్సరాలకుపైగా బైజంటైన్, యూరోపియన్ కరెన్సీగా చలామణి కావడం విశేషం. 337 మే 22న కన్నుమూశారు.

ఎలిజబెత్ టేలర్ (జయంతి)



డేమ్ ఎలిజబెత్ రోజ్‌మండ్ టేలర్ 1932 ఫిబ్రవరి 27న లండన్ దేశంలో జన్మించారు. క్లాజికల్ హాలీవుడ్ సినిమాలో 1950 దశకంలో ఇంగ్లిష్- అమెరికన్ నటిగా ఎంతో పేరొందారు. 1963లో ప్రత్యేకించి చారిత్రాత్మక 'క్లియోపాత్ర' సినిమా బాక్సాఫీస్ హిట్‌గా ఎంతో గుర్తింపు తెచ్చింది. అప్పట్లోనే ఒక మిలియన్ డాలర్ రెమ్యూనరేషన్ పొందిన తొలి నటి కావడం విశేషం. అకాడమీ అవార్డు, గోల్డెన్ గ్లోబ్ అవార్డులు, ఇతరత్రా పురస్కారాలు అందుకున్నారు. 1999లో అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ గ్రేటెస్ట్ 7వ ఫిమేల్ స్క్రీన్ లెజెండ్‌గా ప్రకటించింది. ఆమె పలు సామాజిక సేవలందించారు. 2011 మార్చి 23న కన్నుమూశారు.

నానాజీ దేశ్‌ముఖ్ (వర్ధంతి)



నానాజీ దేశ్‌ముఖ్ 1916 అక్టోబరు 11న మహారాష్ట్ర రాష్ట్రం వషీమ్ జిల్లాలోని కడోజీ గ్రామంలో జన్మించారు. అసలు పేరు చండికా దాస్ అమృత రావు దేశ్‌ముఖ్. సామాజిక ఉద్యమకారుడు. విద్య, ఆరోగ్యం, గ్రామీణ స్వావలంబన రంగాలలో ఎంతో కృషి చేశారు. తొలి గ్రామీణ యూనివర్సిటీ చిత్రకూట్ గ్రామోదయ్ విశ్వ విద్యాలయను ఏర్పాటు చేసి చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. భారతీయ జనసంఘ్ ద్వారా లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగానూ వ్యవహరించారు. 1999లో పద్మభూషణ్ అందుకున్నారు. 2010 ఫిబ్రవరి 27న కన్నుమూశారు. 2019లో మరణానంతర 'భారతరత్న' ప్రకటించారు.

ఎమ్మెల్యే రాజావెంకటప్పకు ఉభయసభలు నివాళి

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): యాదగిరి జిల్లా సురపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయకకు ఉభయసభలు నివాళులు అర్పించాయి. సోమవారం ఉదయం శాసనసభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే స్పీకర్ యూటీ ఖాదర్ ఎమ్మెల్యే మృతి పట్ల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆయనతో ఉన్న అనుభవాలను, ఆయన రాజకీయ విధానాలను వివరించారు. అనంతరం సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ ఓ కుటుంబ సభ్యుడిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. ప్రజాభిమానంతో వరుసగా గెలుపు సాధిస్తుండేవారన్నారు. నిరంతరం నియోజకవర్గ సమస్యల పట్ల చర్చించేవారని సీఎం గుర్తు చేసుకున్నారు. రాజా వెంకటప్ప కుటుంబం దశాబ్దాల కాలంగా రాజకీయాల్లో ఉందన్నారు. ఇటీవలే గిడ్డంగుల కార్పొరేషన్‌కు ఛైర్మన్ చేశామన్నారు. రాజకీయాల్లో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చేవారని గుర్తు చేశారు. ఆయన మృతి తీరని లోటు అన్నారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటాల్లో పాల్గొన్న కుటుంబం నుంచి వచ్చినవారన్నారు. ఆయన తండ్రి బాటలోనే ప్రజాసేవకు వచ్చారన్నారు. సురపుర ప్రాంతంలో ఆయన నిరంతరం ప్రజలమధ్యనే ఉండేవారన్నారు. ఆయన మృతితో ఓ అభిమాని గుండెపోటుతో మృతి చెందారంటే ఎంతటి ప్రజాభిమానం కల్గినవారనేది ఉదాహరణ అన్నారు. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ రాజా వెంకటప్ప నాయక మృతి చెందారనే విషయం మరువలేమన్నారు. పలుమార్లు ఆయనతో చర్చించిన అంశాలను గుర్తు చేసుకున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యులు ఆయన సేవలను కొనియాడారు. వారి కుటుంబానికి సంతాప సందేశం పంపుతామని స్పీకర్ ఖాదర్ వెల్లడించారు.



శాసనసభలో నివాళులు అర్పిస్తున్న సీఎం తదితరులు

పరిషత్‌లో ...

సభాపతి బసవరాజ్ హొరట్టి సోమవారం ఉదయం పరిషత్ కలాపాలు ప్రారంభం కాగానే సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సభా నాయకుడు బోసరాజు, ప్రతిపక్షనేత కోట శ్రీనివాసపూజారి సహా సభ్యులు సంతాపం తెలిపారు.

దేవాలయాల ఆదాయంపై పన్ను విధింపు

అనాలోచిత నిర్ణయం

» దక్షిణ భారత అర్చక సమాఖ్య మండిపాటు

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం రాష్ట్రంలోని హిందూ దేవాలయాల ఆదాయంపై పన్ను వసూలు చేసి ఖజానా లోటును భర్తీ చేసుకోవాలనుకోవడం దివాలాకోరుతనాన్ని చాటి చెబుతోందని దక్షిణ భారత అర్చక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్ఎన్ గోపాలకృష్ణ వ్యాఖ్యానించారు. ఈ మేరకు బెంగళూరులో సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్వం దాతలు, భక్తులు ఇచ్చిన విరాళాలు, నిధుల ద్వారా సంప్రదాయ వారసత్వంగా నిర్వహింపబడుతున్న ఆలయాల ఆదాయంపై ప్రభుత్వ పెత్తనం ఏమిటని ఆయన నిలదీశారు. ఆలయాలకు భక్తులు కానుకల రూపంలో సమర్పించే ఆదాయాన్ని పూర్తిగా ఆలయంలో నిత్యకైంకర్యాలు, ఉత్సవాల కోసం వినియోగించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఆలయాలకు వచ్చే ఆదాయాన్ని అన్య పద్దులకు ఉపయోగించడం ఏమాత్రం సరికాదన్నారు. ఆలయాల ఆదాయంపై పన్ను విధించడం రాజ్యాంగ విరుద్ధం, చట్టవిరుద్ధమన్నారు. భక్తులు తమ ఆరాధ్యదైవాలకు భక్తి పూర్వకంగా సమర్పించే కానుకలు, దాతలు తమ శక్తి కొలది ఏనాడో సమర్పించిన మౌలిక వసతులపై వచ్చే ఆదాయంపై పన్ను విధించడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. ఆలయాల్లో పనిచేసే అర్చకుల జీతాలకు ఎసరు పెట్టాలనే ఆలోచన చేసిన కర్ణాటక ప్రభుత్వం గతంలో నవ్వుల పాలైందని ఇప్పుడు తాజాగా ఆలయాల ఆదాయంపై కన్నేసి పన్నేసే సాహసానికి ఒడిగట్టిందని ఆయన విమర్శించారు. తక్షణం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆధ్యాత్మిక వారసంపదకు నెలవైన కన్నడ రాజ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న తుగ్లక్ నిర్ణయాలపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు.

బెంగళూరు పన్ను... బెంగళూరు హక్కు మాటేంటి?

» కర్ణాటక పన్నులు... కర్ణాటక హక్కు సరే

» నిలదీసిన బీజేపీ



ఎన్ఆర్ రమేష్

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పన్నుల రూపంలో కేంద్రానికి ఇస్తున్న మొత్తంలో వాటా తిరిగి రావడం లేదంటూ విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ తాజాగా కొత్త సవాల్ విసిరింది. కర్ణాటక పన్నులు... కర్ణాటక హక్కు మాట సరే బెంగళూరు పన్నులపై బెంగళూరు ప్రజలకు హక్కు లేదా అని ప్రశ్నించింది. రాష్ట్ర మొత్తం ఆదాయంలో రాజధాని బెంగళూరు నుండి సింహపాలు అందుతోందని అయితే బెంగళూరు నగర అభివృద్ధి విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తూ తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడింది. అలాగని కాంగ్రెస్ ఎంపీ తరహాలో బెంగళూరు నగరాన్ని ప్రత్యేక రాష్ట్రం చేయాల్సిందిగా తాము అస్సలు డిమాండ్ చేయబోమంటూ తేల్చి చెప్పింది. బీజేపీ సీనియర్ నేత ఎన్ఆర్ రమేష్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాకు ప్రతియేటా అబకారి ఆదాయం రూపంలో రూ.36వేల కోట్లు, ఇతర వనరుల ద్వారా రూ.1,73,300 కోట్ల మేరకు ఆదాయం దక్కుతోందన్నారు. ఇందులో బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) నుండి లభిస్తున్న ఆదాయం 46.3 శాతమన్నారు. బెంగళూరు నగరంలో పలు పన్నుల రూపం లోనే ప్రభుత్వానికి ఏటా రూ.80,238 కోట్లు లభిస్తున్నాయన్నారు. దేశ ఐటి రాజధానిగా ఉన్న బెంగళూరు నగరం నుంచి సాఫ్ట్‌వేర్ కంపెనీ ఎగుమతుల ద్వారా రూ.1,30,000 కోట్లకు పైగా ఆదాయం లభిస్తోందన్నారు. ఇంత భారీ మొత్తాన్ని అందిస్తున్నా నగర అభివృద్ధికి మాత్రం తిరిగి కేటాయిస్తున్న గ్రాంట్లు చాలా తక్కువన్నారు. బీబీఎంపీలో అభివృద్ధి పనులకు 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ 3వేల కోట్లు మాత్రమే కేటాయించారని ప్రస్తుత ఏడాది రూ.3,050 కోట్లు కేటాయించారని ఇంతకంటే దారుణమైన అన్యాయం మరొకటి ఉండదన్నారు. రాజధాని బెంగళూరు నగరం అందిస్తున్న ఆదాయంలో తిరిగి కేవలం 2.87 శాతం మాత్రమే ఇస్తున్నారని ఎన్ఆర్ రమేష్ పేర్కొన్నారు. మొత్తం మీద ఏటా రూ.2 లక్షల కోట్లకు పైగా ఆదాయం అందిస్తున్న రాజధాని ప్రజలకు న్యాయం జరుగాలన్నదే తమ ఉద్దేశ్యమన్నారు. బెంగళూరు పన్ను బెంగళూరు ప్రజల హక్కు అనే నినాదాన్ని ప్రస్తావించిన ఆయన బెంగళూరు నగర సమగ్ర అభివృద్ధికి కనీసం రూ.8,500 కోట్లు కోరినా ప్రభుత్వం కేవలం రూ 3వేల కోట్లు మాత్రమే ఇస్తోందన్నారు. ఈ అన్యాయాన్ని రాజధాని ప్రజలు నిలదీసే రోజు వస్తుందన్నారు.

సమాజం కోసం పాటుపడాలి



పూర్వ విద్యార్థులు, గురువులు

విజయపుర, ఫిబ్రవరి 26: జీవితంలో సమాజం ద్వారా ఎన్నో ఉత్తమ స్థానాలు పొందడం, ఆర్థికత, ఇతర గౌరవాలు పొందిన మనం కూడా సమాజం కోసం పాటుపడాల్సి ఉందని ప్రఖ్యాత రచయిత్రి ఇందిరా శివణ్ణ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ పీయూ కళాశాలలో సోమవారం ఏర్పాటైన పూర్వ విద్యార్థుల కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటైన సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన బాధ్యతను సీనియర్ విద్యార్థుల సహకారానికి తాము చేయూత ఇస్తామన్నారు. విద్యాసంస్థ 75వ వార్షికోత్సవం జరుపుకుంటోందని హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలోని హైస్కూల్ విభాగం వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వంచే ఏర్పాటైన ఎస్‌డీఎంసీ పనిచేస్తోందని ఇందుకు సీనియర్ విద్యార్థుల సంఘం పాఠశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ఇప్పటికే పలువురు దాతలు చాపలు అందించారని వచ్చేవారం పాఠశాల వార్షికోత్సవం ఉంటుందన్నారు. ఈసందర్భంగా బెంగళూరు దాతల సహకారంతో పాఠశాల విద్యార్థులందరికీ స్పోర్ట్స్ యూనిఫాం అందచేశారు. నాలుగైదేళ్లుగా ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో 75-90శాతం ఉత్తీర్ణత నమోదవుతోందని, మరింత సహకారం అందిస్తే ప్రైవేట్ దీటుగా రాణించవచ్చునన్నారు. ఈ సందర్భంగా అడహక్ కమిటీని ఏర్పాటు చేసి సమాచార రంగంలో మాతృభాష కన్నడ ఆప్ రూపొందించిన ఆర్ చందన్‌కుమార్‌ను అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. కార్యదర్శిగా టీచర్ బీఎస్ నారాయణ్, కోశాధికారిగా వీణా నాగరాజ్, సభ్యులుగా వ్యవసాయశాఖ రిటైర్డు అధికారి పద్మరాజు తదితరులు ఉన్నారు. పాత బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులను ఏకతాటిపైకి తెచ్చేలా కార్యాచరణ సిద్ధం చేశారు. కార్యక్రమంలో జాతీయ బసవదళ కార్యదర్శి జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



అంబిటస్ వరల్డ్‌స్కూల్ ప్రారంభంలో ఇస్రో మాజీ ఛైర్మన్ కిరణ్‌కుమార్, ఎమ్మెల్యే శివణ్ణ తదితరులు

బొమ్మనహళ్ళి, ఫిబ్రవరి 26: గుణాత్మక విద్యను అందించినప్పుడు పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఇస్రో మాజీ ఛైర్మన్, పద్మశ్రీ గ్రహీత కిరణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. చందాపుర సమీపంలోని అంబిటస్ వరల్డ్‌స్కూల్ ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని అప్పుడే వారి భవిష్యత్తుకు బాటలు పడతాయన్నారు. తద్వారా దేశభవిష్యత్తు కూడా అభివృద్ధి పథంలో సాగేందుకు విద్య దోహదపడుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పాఠశాలల్లో చేర్పిస్తారని అందుకు తగిన న్యాయం చేయాలన్నారు. కాగా ఇస్రో సంస్థ కూడా శాస్త్రవేత్తలను ఎంతగానో ప్రోత్సహిస్తోందన్నారు. ఇస్రోకు ప్రపంచవ్యాప్తంగా గొప్ప పేరుందని ఇందుకు గుణాత్మక విద్య, మేధా సంపత్తే కారణమన్నారు. సరైన విద్య లేక ఎన్నో కుటుంబాలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని, చదువుతోనే ప్రగతి సాధ్యమన్న అంశాన్ని గుర్తించాలన్నారు. పాఠశాల ఫౌండర్ డైరెక్టర్ నరేంద్ర మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని తమ పాఠశాలలు విజయపథంలో సాగుతున్నాయన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులే తమ విజయానికి కారణమన్నారు. బెంగళూరులో ఇదే తొలిశాఖను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం నర్సరీ నుంచి 7వ తరగతి వరకు తరగతులు ఉన్నాయని, అత్యాధునిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆనేకల్ ఎమ్మెల్యే శివణ్ణ, విద్యాసంస్థ ఛైర్మన్ శీనయ్య, వైస్ ఛైర్మన్ పాండురంగాచారి తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి.

చిక్కదాసరహళ్లి డెయిరీకి నూతన డైరెక్టర్లు



ఎమ్మెల్యేతో పాలసంఘం డైరెక్టర్లు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 26: తాలూకాలోని చిక్కదాసరహళ్ళి గ్రామంలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలోని 13 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో జేడీఎస్ మద్దతుదారులు 9మంది డైరెక్టర్‌లు గెలుపొందారు. కే మునియప్ప, ఆర్ నాగరాజ్, ఎం బ్యాటరాయప్ప, చోటిమ, హెచ్ నారాయణస్వామి, మంజునాథ, రియాజ్, టీ మంజునాథ్, బీ మునీంద్రలు జేడీఎస్ మద్దతుదారులు విజయం సాధించారు. కొత్త డైరెక్టర్‌లు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలసి తమ విజయానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నూతన డైరెక్టర్‌లను ఎమ్మెల్యే ఆత్మీయంగా సత్కరించారు. కాగా పాల సంఘం బలోపేతానికి డైరెక్టర్‌లు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ సభ్యుడు బంక్ మునియప్ప, గ్రామ ప్రముఖులు మునిరాజు, అక్బర్, నాగేశ్, లక్ష్మీకాంత మూర్తి తదితరులు పాల్గొన్నారు.

త్రిభువన్ వరదరాజు కన్నుమూత

» ప్రముఖుల సంతాపం



వరదరాజు (ఫైల్)

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): త్రిభువన్ వరదరాజుగా ఖ్యాతి గడించిన ప్రవాసాంధ్ర ప్రముఖుడు వరదరాజు (87) బెంగళూరు సదాశివనగర్‌లోని తన నివాసంలో ఆదివారం ఉదయం కన్నుమూశారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఏడాది కాలంగా వరదరాజు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పాలసముద్రం మండలానికి చెందిన వరదరాజు కాంట్రాక్టర్‌గా కెరీర్‌ను ప్రారంభించారు. బెంగళూరులో త్రిభువన్ హోటల్‌ను నిర్మించారు. విద్యా, సాంస్కృతి రంగాలకు గణనీయ సేవలందించారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెక్నాలజీ సంస్థ ఛైర్మన్‌గానూ, తిరుమల విద్యానికేతన్ అధ్యక్షునిగానూ సేవలందించారు. వరదరాజు మృతి పట్ల తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు డా.ఎ.రాధాకృష్ణరాజు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షులు కే గంగరాజు, ఆర్.ఆదికేశవులు నాయుడు, సమితి విద్యా ట్రస్టు అధ్యక్షుడు మౌర్య శ్యామరాజు, ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజుతో పాటు పలువురు ప్రముఖులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. వరదరాజు అంత్యక్రియలు బెంగళూరు హెబ్బాళ స్మశానవాటికలో ఆదివారం సాయంత్రం జరిగాయి. చిత్తూరు జిల్లా నుంచి విచ్చేసిన అభిమానులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు.

జేడీఎస్ నేత మృతి

» గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడిగా సేవలు



వెంకటరామరెడ్డి (ఫైల్)

చింతామణి, ఫిబ్రవరి 26: తాలూకాలోని జేడీఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఏనిగదలె గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు బీవీ వెంకటరామరెడ్డి (80) ఆదివారం రాత్రి సుమారు 10 గంటలకు ఇంట్లో కన్నుమూశారు. మాజీ మంత్రి కేఎం కృష్ణారెడ్డికి కుడిభుజంగా ఉండేవారు. ఆయన అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం 1 గంటలకు ఏనిగదలె గ్రామంలో జరిగాయి. పలువురు గ్రామ పెద్దలు, ప్రముఖులు ప్రగాఢం సంతాపం తెలిపారు. గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలను ప్రస్తావించారు. జేడీఎస్ నాయకుడిగా ఎంతో గుర్తింపు పొందారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. వెంకట రామరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, పెద్దసంఖ్యలో బంధువులు ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగండి

చేళూరు, ఫిబ్రవరి 26: ప్రాథమిక దశనుంచే స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకుని హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని గ్రామపంచాయతీ ఉపాధ్యక్షురాలు సీతమ్మ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. పాతపాళ్య ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఇటీవల ఏర్పాటైన పాఠశాల విద్యార్థుల గ్రామసభలో పిల్లలను ద్దేశించి మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని గురువులు, తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. అలాగే ఆటపాటల్లోనూ రాణించాలన్నారు. పీడీఓ నారాయణస్వామి మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలలో గడుపుతారని, వారి విద్యాభివృద్ధికి రాచబాటలు వేసేలా ఉపాధ్యాయులు దిశానిర్దేశం చేయాలన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, క్రిష్ణప్ప, గ్రామసభ్యులు నరసింహమూర్తి, కార్యదర్శి గోవిందప్ప, గంగిరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ రీటైల్ వ్యాపారంలో ఏఐ సాంకేతికత కీలకం



ఫ్యాషన్ ఫోరం సదస్సులో పాల్గొన్న మెటా, యూట్యూబ్ ముఖ్యులు

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశీయ ఫ్యాషన్ వ్యాపార రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) సాంకేతికత కీలకమైందని మెటా ఇండియా డైరెక్టర్ మేఘనా అప్పారావ్ అభిప్రాయపడ్డారు. బెంగళూరులో జరిగిన ఫ్యాషన్ ఫోరం 2024లో ముఖ్యులుగా పాల్గొన్న ఆమె పలువురు ఫ్యాషన్ డిజైన్ విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న ఫ్యాషన్ రంగంలో కృత్రిమ మేధస్సు ద్వారా వినియోగదారులతో సంబంధాలు పెంచుకోవడం, కొనుగోళ్ళు, ధరలు వ్యత్యాసాలు నిర్ణయించేందుకు మెటా ప్లాట్‌ఫాం కీలకంగా పనిచేస్తోందన్నారు. యూట్యూబ్ ఇండియా సేల్స్ ముఖ్యులు శుభాపై మాట్లాడుతూ ఇటీవల డిసెంబరులో విశ్వవ్యాప్తంగా 3.8శతకోట్ల మంది వీక్షించారని అందుకు అనుగుణంగానే వ్యాపారాలు పెరిగాయన్నారు. అరవింద్ ఫ్యాషన్ డిజైన్ సీఎండీ శైలేష్ చతుర్వేది మాట్లాడుతూ మా వ్యాపార వ్యవహారాలను ఏవిధంగా నిర్వహిస్తామనేందుకంటే మా పెట్టుబడులు ద్వారానే ఆధునిక శైలి వ్యాపారాలను ఏవిధంగా అభివృద్ధి సాధించాలనేది కీలకంగా భావిస్తున్నామన్నారు. సాధారణ పట్టణాలలోను ఆన్‌లైన్ వ్యాపారాలు వచ్చేశాయన్నారు. టెక్నోపార్క్ ఛైర్మన్ సలోని సాంగియా మాట్లాడుతూ వినియోగదారులు కోరుకునే మార్పులకు అనుగుణంగానే డిజైన్‌లలోకి రావాల్సి ఉందని నాణ్యతకు ఎక్కడా లోటు రాకుండా చూసుకుంటూనే బ్రాండింగ్ కొనసాగనుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఎవరబ్బ ఆస్తి కాదు

» బీజేపీ ఎంపీపై మండిపడ్డ సీఎం కుమారుడు యతీంద్ర సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఎవరబ్బ ఇంటి ఆస్తి కాదని ఉత్తరకన్నడ బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే వ్యాఖ్యలను తిప్పికొట్టేలా సీఎం కుమారుడు యతీంద్ర సిద్దరామయ్య మండిపడ్డారు. గదగ్‌లో సోమవారం యతీంద్ర మీడియాతో మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్యను ఉద్దేశించి మీ అబ్బ సొత్తా అంటూ ఎంపీ వ్యాఖ్యలు సరికాదన్నారు. అలాగైతే కేంద్ర ప్రభుత్వం ఎవరబ్బ సొత్తు కాదన్నారు. కర్ణాటక ప్రజలు చెల్లించిన పన్నులను కేంద్ర ప్రభుత్వం అందరికీ సమానంగా పంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వెనుకబడిన రాష్ట్రాలకు ఎక్కువ గ్రాంట్‌లు మేం వద్దు అనేది లేదన్నారు. అయితే మాకు అన్యాయం జరుగుతోందని సరిచేయాలనేది మా డిమాండ్ అన్నారు. రాష్ట్రం నుంచి వేయి రూపాయలు పన్నుగా చెల్లిస్తే వాపసుగా 12 లేదా 13 పైసలు వాపసు వస్తోందని కనీసం 25 పైసలు ఇవ్వాలనేది కోరుతున్నామన్నారు. హిందూ దేవాలయాల సొమ్ము దుర్వినియోగం అవుతోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. బీజేపీ వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోనుందన్నారు. కాగా తప్పుడు ప్రచారంపై దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి సమగ్రంగా వివరణ ఇచ్చారన్నారు.

కాంగ్రెస్ యువనేత రక్షారామయ్య పర్యటన



గ్రామాల ప్రముఖులతో ముచ్చటిస్తున్న రక్షారామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రక్షారామయ్య చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ జిల్లాల్లో గత రెండు రోజులుగా విస్తృత పర్యటనలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన పలు ధార్మిక, క్రీడా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆదివారం ఆయన తొలుత గుడిబండ తాలుకాలోని యెల్లోడు ఆదినారాయణస్వామి జాతర మహోత్సవంలో పాలుపంచుకున్నారు. దైవ దర్శనం చేసుకున్న అనంతరం తాలుకా కాంగ్రెస్ నేతలతోనూ, వివిధ నియోజకవర్గాల ప్రముఖులతోనూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గుడిబండ తాలుకాలోని ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. మధ్యాహ్నం చిక్కబళ్లాపురంలోని సర్ ఎంవీ స్టేడియంలో ఏర్పాటైన క్రీడా టోర్నమెంటుకు హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడలు మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయని క్రీడాకారులను తమ ప్రభుత్వం వెన్నుతట్టి ప్రోత్సహిస్తోందని చెప్పారు. అనంతరం ఆయన దేవనహళ్ళిలోని వేణుగోపాల స్వామి బ్రహ్మరథోత్సవంలో పాలుపంచుకున్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో ఏర్పాటైన బాడిబిల్డింగ్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చివరగా ఆయన దొడ్డబళ్ళాపుర పట్టణంలో ఏర్పాటైన కబడ్డీ టోర్నమెంటుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్ని పర్యటనల్లోనూ ప్రజలు రక్షారామయ్యకు ఆత్మీయస్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు.

రైల్వే ఫ్లై ఓవర్‌కు శంకుస్థాపన



శంకుస్థాపనలో ఎంపీ మునిస్వామి తదితరులు

బంగారపేట, ఫిబ్రవరి 26: దశాబ్దాలక్రితం నాటి రైల్వే స్టేషన్‌ల పునరుద్ధరణకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చర్యలు చేపట్టారని ఎంపీ మునిస్వామి తెలిపారు. అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద 554 రైల్వేస్టేషన్‌ల అభివృద్ధితోపాటు 1500 రైల్వే ఫ్లై ఓవర్‌లు, అండర్‌పాస్‌లకు శంకుస్థాపన చేశారన్నారు. సోమవారం ఫ్లై ఓవర్ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో రోజుకు 4 కిలోమీటర్ల రైల్వే పనులు జరిగేవని ప్రస్తుతం 15 కిలోమీటర్ల మేర జరుగుతున్నాయన్నారు. బంగారపేట నుంచి చిక్కబళ్ళాపుర వెళ్లేందుకు ఎలక్ట్రికల్ రైలు ఉందన్నారు. బంగారపేట, ఉరిగాం, మారికుప్పం, బీసానమ్ తదితర స్టేషన్‌లు గతంలో ఎలా ఉండేవి ఇప్పుడు ఎలా ఉన్నాయనేది ప్రజలు స్వయంగా గమనించవచ్చునన్నారు. బూదికోటకు వెళ్లే మార్గం చాలా చిన్నగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య ఉండేదని, ఇటీవల రైల్వే మంత్రితో సమస్యను వివరించడంతో 40 అడుగుల స్థలాన్ని ఎటువంటి షరతులు లేకుండా కేటాయించారన్నారు. కాగా బూదికోట సర్కిల్‌లో ఎలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని ఆదేశించామని, వందే భారత్ రైలును బంగారపేటలో ఆపేలా కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని గ్రాంట్లు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బీవీ మహేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు హోసరాయప్ప, పురసభ సభ్యులు కే చంద్రారెడ్డి, తాలూకా పంచాయతీ సభ్యుడు పీ అమరీశ్, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హంసధ్వని బృందంచే సంగీత సంబరం



గాయకుల బృందం

బెంగళూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన హంసధ్వని సంగీత బృందం 6వ వార్షికోత్సవ సంబరం అలరించింది. చెన్నై, బెంగళూరు, కోయంబత్తూరు, హైదరాబాద్‌లకు చెందిన ప్రముఖ గాయకులు దక్షిణభారత్‌లోని అన్ని భాషల పాటలను ఆలపించారు. పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమానికి బెంగళూరు, చెన్నైల నుంచి 150మందికిపైగా గాయకులు పాల్గొన్నారు. సంగీత అభిమానులకు కనువిందు చేసేలా వార్షికోత్సవం శని, ఆదివారాలలో జరిగింది. ఈమేరకు బెంగళూరులో హంసధ్వని బృందం ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. వార్షికోత్సవం ద్వారా దక్షిణభారత వ్యాప్తంగా అందరినీ ఐక్యం చేయాలని భావించి నిర్వహించామన్నారు.

అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 26: సమాజంలో పేదలు, ప్రజల సంక్షేమానికి ధర్మస్థళ స్వసహాయ సంఘం ఏర్పడిందని, సమాజ అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమని సంఘం అధికారులు అభిప్రాయపడ్డారు. తాలూకా స్థాయి మహిళా జ్ఞాన వికాస కార్యక్రమంలో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్రహెగ్డే చొరవతో గ్రామీణ వాసులకు అనుకూలంగా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. మహిళల స్వావలంబనకు చేయూత ఇస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు.